క్లుప్తంగా

టీటీడీ పీఆర్వో కృష్ణకు మాజీ ఎమ్మెల్యే నివాళి



కృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సంజీవయ్య

వెంకటగిరి రూరల్: టీటీడీ పీఆర్వోగా పనిచేస్తున్న కృష్ణ అనారోగ్యంతో కన్నుమూశారు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు కిలివేటి సంజీవయ్య మంగళవారం వెంకటగిరిలోని కృష్ణ నివాసం వద్దకు చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సంస్కృతి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం జయరామయ్య పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల సమగ్ర పరిశీలన



మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్

వాకాడు: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండల ఓటర్ల జాబితాలపై సమగ్ర పరిశీలన చేయాలని తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్ బీఎల్వోలను ఆదేశించారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో బీఎల్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 2002, 2025 ఓటరు జాబితాలను గ్రామ పంచాయతీల వారీగా పరిశీలించి లోపాలను గుర్తించాలన్నారు. అనంతరం ఆయన ఓటరు జాబితాలను ఏవిధంగా వెరిఫై చేయాలన్న అంశంపై బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లుకు అవగాహన కల్పించారు.

నెలబల్లిలో వైద్యశిబిరం



రోగులకు పరీక్షిస్తున్న డాక్టర్ చైతన్య

దొరవారిసత్రం : మండలంలోని నెలబల్లి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. చిన్న పిల్లలు, గర్భిణులకు వ్యాక్సినేషన్ చేశారు. కిశోర బాలికల ఆరోగ్యం, మానసిక వైద్య పరీక్షలపై వైద్యాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంకమ్మ అవగాహన కల్పించారు.

మహిళలకు వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కలువాయి(సైదాపురం): మండలంలోని కలువాయి-2 సచివాలయం పరిధిలో స్వస్థ్ నారీ సశక్తి అభియాన్ కార్యక్రమాన్ని వైద్యులు అన్వర్‌బాషా, విజయలక్ష్మి, రమ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు.

26న జిల్లా సదస్సు



మాట్లాడుతున్న పోలయ్య

గూడూరురూరల్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న గూడూరులో బీసీడబ్ల్యూయూ జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు డి.పి.పోలయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం, భారత కార్మిక సమైక్య సంఘాల జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న భవన నిర్మాణ కార్మికులు ప్రస్తుతం ఉపాధి కోల్పోయి కార్మికులు దుర్భర జీవితం గడుతున్నారన్నారు. సర్క్యులర్ 1214ను రద్దు చేసి సంక్షేమ బోర్డును యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు చెంగల్‌రావు, బీసీడబ్ల్యూయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవకోటి, అనిల్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు 24-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	128
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	230
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	256
లేయర్ చికెన్	:	187

కలుగుర్తిపాడు చెరువుకు పడిన గండి



చెరువులో నుంచి కాలువ ద్వారా వృథాగా పోతున్న సాగునీరు



ప్రమాదకరంగా చెరువు కట్టలు

- శిథిలావస్థలో తూములు
- వృథాగా బయటకు వెళుతున్న సాగు నీరు

చిట్టమూరు : మండలంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువు కట్టలు, తూములు సక్రమంగా లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులకు పూర్తి స్థాయిలో నీరు చేరితే చెరువు కట్టలు బలహీనంగా ఉన్నాయని అవి ఎక్కడ తెగిపోతాయోనన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 98 చెరువులు ఉన్నాయి. వాటిలో 33 మేజర్, 63 మైనర్ చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల కింద మొత్తం 30 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేస్తారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కోగిలి, ఆరూరు, చిట్టమూరు, చిల్లమూరు తదితర చెరువు కట్టలకు, తూములకు సక్రమంగా మరమ్మతు పనులు చేయలేదు. తూతూమంత్రంగా పనులు చేసి నిధులు స్వాహా చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. దీంతోపాటు కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా సాగునీటి సంఘాల అధ్యక్షులను, తూములకు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. అయితే ఆ పదవులు అలంకారప్రాయంగానే మిగిలాయి. చెరువులకు గత సంవత్సరం వర్షాకాలంలో పడిన గండ్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయకపోవడం, తూములు శిథిలావస్థకు చేరుకుని చెరువులోని నీరంతా తూముల ద్వారా బయటకు వెళ్లిపోతుందని రైతులు పేర్కొన్నారు. అయితే కూటమి నేతలు చెరువు మరమ్మతులు మరిచి, చెరువు కట్టపై ఉన్న వేప, కర్రతుమ్మ చెట్లు నరికి వాటిని అమ్ముకుని జేబులు నింపుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. యాకసిరి, ఆరూరు, మల్లాం, కలగుర్తిపాడు, చిల్లమూరు, మొలకలపూడి గ్రామాల చెరువులు మరీ దారుణంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఆరూరు చెరువు కలుజుకు పూర్తిగా మరమ్మతు చేయకపోవడంతో ప్రమాదకరంగా ఉందని రైతులు పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన చెరువు కట్టలకు, తూములకు మరమ్మతు పనులు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరి నీరు లీకవుతున్న తూము

నాలుగు చెరువులకు ప్రతిపాదనలు పంపాం

చిట్టమూరు మండలంలో ఆరూరు, ఎల్లసిరి, చిల్లమూరు, మల్లాం చెరువులకు మరమ్మతులు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. పనులు మంజూరు కాలేదు. అయితే చెరువులకు సంబంధించి తూములకు మరమ్మతులు చేయడానికి త్రిబుల్‌ఆర్ కింద సాగునీటి సంఘం అధ్యక్షుల ద్వారా మరమ్మతులు చేపట్టి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– అబ్దుల్ ఘనీ, ఇరిగేషన్ ఏఈ, చిట్టమూరు

మాజీ మంత్రి పెద్దిరెడ్డితో గూడూరు నేతలు

గూడూరురూరల్ : గూడూరు జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, ఆమె భర్త జగనన్న సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఊటుకూరు మహేంద్రరెడ్డితోపాటు, గూడూరు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. మహేంద్రరెడ్డి మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, కార్యకర్తల క్షేమ సమాచారాన్ని పెద్దిరెడ్డి అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విందూరు ఎంపీటీసీ సభ్యుడు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, కొమ్మనేటూరు సర్పంచ్ పాలేపు వెంకటమ్మ, గోపాల్, మాజీ ఎంపీటీసీ బత్తల పెంచలరావు, ఎస్సీ సెల్ పట్టణ మాజీ అధ్యక్షుడు నరసయ్య, తిరుపాలయ్య, పెంచలరాజు, రవీంద్రరెడ్డి, రాజశేఖర్, గురవయ్య, చరణ్, ప్రకాష్, సునీల్, జయశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసిన జెడ్పీటీసీ యామిని దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

వైద్య కళాశాలల ప్రైవేటుపరంపై రాస్తారోకో

వెంకటగిరి రూరల్: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు లీజుకు ఇచ్చే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని పీడీఎస్ఓ నాయకులు సిహెచ్ పవన్ విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసే కుట్రను నిరసిస్తూ పీడీఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. తొలుత విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద రాస్తారోకోతో నినాదాలు హోరెత్తించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 17 మెడికల్ కళాశాలలను బడా బాబులకు కట్టబెట్టాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) అనుమతితో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు నిధులు సమకూర్చిందని గుర్తుచేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ఓ నాయకులు షేక్ తేజు, తిరుమలేష్, శేఖర్, మనోజ్, శివ, యుగంధర్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న పీడీఎస్ఓ నాయకులు, విద్యార్థులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని శ్రీనివాసపురం గ్రామ సమీపంలో వాసమ్మ ఆశ్రమం వద్ద మంగళవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు వారి సౌజన్యంతో తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాల వారు నిర్వహించిన వైద్య శిబిరంలో 208 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు జరిపినట్లు తెలిపారు. వారికి ఉచితంగా మందులు సైతం పంపిణీ చేసినట్లు ట్రస్టు డైరెక్టర్ చాగణం గౌరీ శంకర్, సీఈఓ సీతా రామానాయుడు తెలిపారు. 25 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వీరిని ప్రత్యేక వాహనంలో తిరుపతిలో కంటి వైద్యశాలకు తీసుకెళ్లి కంటి శస్త్ర చికిత్సల అనంతరం తిరిగి నాయుడుపేటలో వదిలిపెట్టనున్నట్లు వెల్లడించారు.

ఎన్‌సీసీ నేవీ క్యాడెట్ల ఎంపిక



ఎన్‌సీసీ నేవీ శిక్షణకు ఎంపికైన విద్యార్థులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టీలో మంగళవారం ఎన్‌సీసీ 10ఏ నావల్ యూనిట్ నెల్లూరు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ నేవీ క్యాడెట్ల సెలక్షన్స్ నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారులు వైకుంఠం, లక్ష్మణ్‌కుమార్ పర్యవేక్షణలో మొత్తం 180 మందికిగాను 21 మందిని శిక్షణకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ మల్లికార్జున్‌రెడ్డి అభినందించారు.

చీడపీడలు సకాలంలో గుర్తించాలి

కలువాయి (సైదాపురం): మండలంలోని పెన్నబద్దవోలు, కుల్లూరు-2 రైతు సేవా కేంద్రంలో పరిధిలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె శివనాయక్, మండల వ్యవసాయాధికారి కళారాణి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శివనాయక్ మాట్లాడుతూ అధిక యూరియా వాడడం వల్ల కలిగే నష్టాలను వరిలో వచ్చే చీడపీడల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయశాఖ అధికారి కళారాణి మాట్లాడుతూ రైతులు కౌలు చేసేవారు తప్పకుండా కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం గురించి రైతులకు అవగాహన కల్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిల్లకూరు: గూడూరు పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు డివైడర్‌పై మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి మంగళవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఒకటవ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అయితే మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదిలో ఉంచినట్లు తెలిపారు. మృతుడు సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయసు ఉంటుందని సిమెంట్ కలర్ చొక్కా, బ్లూ కలర్ లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

కండలేరులో 52.580 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 52.580 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,040 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 570, పిన్నేరుకాలువకు 100, లోలెవల్ కాలువకు 40, మొదటిబ్రాంచ్ కాలువకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

మహిళల ఆరోగ్య భద్రతకు కృషి

సైదాపురం: మహిళల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మండల వైద్యాధికారి డాక్టర్ జనార్దన్ తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు

చిల్లకూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని చిల్లకూరు పీహెచ్‌సీ వైద్యులు అరఫాత్ సూచించారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా మంగళవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో స్వస్థ స్వశక్త్ పరివార్ అభియాన్ కింద గ్రామస్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

పోషకాహారంతో రక్తహీనతకు చెక్

రాపూరు: పోషకాహారంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని సీడీపీఓ సునందన పేర్కొన్నారు. జాతీయ పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలో పంగిలి సచివాలయంలో మంగళవారం పౌష్టికాహారంపై గర్భిణులు, తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

వెంకటగిరి రూరల్ : తమ వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య పేర్కొన్నారు. సోమవారం 14వ వార్డుల్లో పర్యటించి పలు సమస్యలను తెలుసుకున్నారు. ధర్మపురంలో ఇళ్ల సమీపంలో గుంతలు ఏర్పడి మురుగునీరు నిల్వచేరుతోందని గుర్తించారు. అమ్మవారిపేట చెరువు స్థలం క్రమేణా ఆక్రమణకు గురవుతోందని ఆయన తెలిపారు.

కూటమి పాలకులకు భయమెందుకు?

పెళ్లకూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత పాలనలో చేస్తున్న అభివృద్ధిని నేరుగా చూస్తామంటే కూటమి పాలకులకు భయమెందుకని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి మంగళవారం కందుకూరు నియోజకవర్గం రామాయపట్నం పోర్టులో జరుగుతున్న పనులను నేరుగా చూసేందుకు వెళుతుండగా పోర్టు ప్రవేశ ద్వారం వద్ద పోలీసులతో అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. అబద్ధాలే అజెండాగా సాగుతున్న కూటమి పాలకుల తీరుపై మండిపడ్డారు. రైతుల కష్టాలు, ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా కూటమి పాలకులు చేస్తున్న ఇసుక మాఫియా, మట్టి, గ్రావెల్ మాఫియా, దందాలు, దౌర్జన్యాలు తప్ప అభివృద్ధి జాడే లేదని విమర్శించారు. పెళ్లకూరు మండలంలో 24పంచాయతీలకు గాను 4,750 హెక్టార్లు వరి సాగు చేసేందుకు రైతులంతా సన్నద్ధం అవుతుంటే పెళ్లకూరు, చెంబేడు, నెలబల్లి ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ గోదాముల్లో ఒక్క యూరియా బస్తా కూడా అందుబాటులో లేకపోవడమే కూటమి పాలనకు నిదర్శనం అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

పాడి పశువుల పెంపకంపై రైతులకు శిక్షణ

గూడూరురూరల్ : పాడి పశువుల యాజమాన్యంపై గూడూరులోని ప్రాంతీయ పశువైద్యశాలలో నెల్లూరు ఆత్మ పథకం సౌజన్యంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పాడి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి.సురేష్ మాట్లాడుతూ పాడి పశువుల పెంపకం ఆవశ్యకత, కాలంలో పశువుల్లో వచ్చే వ్యాధులు, లేగదూడల పెంపకంపై అవగాహన కల్పించారు. పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులు, పెయ్య దూడ ల ఉత్పత్తి పథకం(సెక్స్ సార్టెడ్ సీమెన్) 50 శాతం రాయితీతో రైతులకు ఒక డోసు రూ.150కే ఎదకు వచ్చిన పశువులకు వేస్తారని తెలిపారు. కోట ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి.వి.సుబ్రమణ్యం మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బహువార్షిక పశు గ్రాసాల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చెన్నూరు ఇన్‌చార్జి పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్, వ్యవసాయ శాఖ ఏడీ గోపీ నాయక్, పాడి రైతులు పాల్గొన్నారు.



పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేష్

తడలో కోనేరు పూడ్చివేతకు తీర్మానం

తడ: మండల కేంద్రంలోని బజారుకు సమీపంలో ఉన్న కోనేరును పూడ్చివేసేందుకు మండల సమావేశం తీర్మానించింది. ఎంపీడీఓ శేఖర్ నాయక్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. మండలంలో ఏకైక మేజర్ పంచాయతీ తడ కండ్రిగ నడిబొడ్డున ఉన్న కోనేరును పూడ్చేందుకు సమావేశంలో తీర్మానం చేశారు. గతంలో ఎంతో సుదరంగా ఉంటూ గ్రామానికి మంచినీటి వనరుగా ఉన్న కోనేరును పూడ్చడంపై ఇప్పటికే పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 1.82 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కోనేరు ప్రస్తుతం ఆలనా పాలనా లేకపోవడంతో చాలా కాలంగా ఇది మురుగు గుంటగా మారి ఆక్రమణలకు గురవుతోంది. గతంలో దీనిపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి వచ్చిన సమయంలో దీనిపై గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని తహసీల్దార్ శరత్‌కి సూచించారు. అయితే అలాంటి అభిప్రాయాలు తీసుకోకుండా హడావుడిగా తీర్మానం చేయడం పలు అనుమానాలు, విమర్శలకు తావిస్తూ ఉంది. సమావేశంలో తహసీల్దార్ శరత్, ఎంపీపీ కే రఘురెడ్డి, జెడ్పీటీసీ ఇందుమతి కార్తిక్, వైస్ ఎంపీపీ కే వెంకటేష్ పాల్గొన్నారు.

వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు





సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి స్థానిక భక్తులు అమ్మవారికి చీర సారెను ఊరేగింపుగా సమర్పించారు. శ్రీ గాయత్రీ అలంకారంతో చెంగాళమ్మ పరమేశ్వరి దర్శనమిచ్చారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని అమ్మవార్లు పలు అలంకారాల్లో భక్తులను కటాక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్

సూళ్లూరుపేట : గాయత్రీదేవిగా చెంగాళమ్మ, చెంగాళమ్మకు సారె తీసుకెళుతున్న భక్తులు



గూడూరు: శ్రీ అన్నపూర్ణగా శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి



చిల్లకూరు: అన్నపూర్ణాదేవిగా ముత్యాలమ్మ



చిట్టమూరు: బాలాత్రిపుర సుందరీ దేవిగా కామాక్షమ్మ



వెంకటగిరి : రాజరాజేశ్వరీ దేవిగా మందనాంచరీశ్వరి



రాపూరు: గాయత్రీదేవిగా కన్యకాపరమేశ్వరి



నాయుడుపేట: గాయత్రి దేవిగా దుర్గమల్లేశ్వరిదేవి

బాలింతలకు వైద్య పరీక్షలు

వాకాడు: మండలంలోని కొండూరు గ్రామ సచివాలయంలో మంగళవారం వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది సంయుక్తంగా స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసిన అనంతరం మందులు పంపిణీ చేశారు. బాలింతలు, గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహార వంటకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి తల్లులకు పంపిణీ చేశారు.